క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కడియం: కడియంలోని ఆటోస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. అతడి వయస్సు సుమారు 60 ఏళ్ల ఉంటాయని భావిస్తున్నారు. ఒంటిపై ఎరుపురంగు టీ షర్ట్, ముదురు రంగు నిక్కరు ఉన్నాయి. మృతదేహం పక్కనే చేతి కర్ర, చెప్పులు పడి ఉన్నాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతుడి వివరాలు సేకరిస్తున్నారు.

సచివాలయం ప్రారంభం



సచివాలయ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

కడియం: కడియపుసావరంలో సచివాలయ భవనాన్ని బుధవారం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ప్రారంభించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలోక ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, గ్రామ సర్పంచ్ చక్కపల్లి మురళి, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం బుర్రిలంకలో పితృవియోగంతో బాధపడుతున్న గట్టి సుబ్బారావు, నరసయ్య సోదరులను ఎంపీ పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల కోసం గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అన్నపూర్ణమ్మపేట, జాంపేట మసీదు ప్రాంతం, అశోక థియేటర్ పరిసరాలు, మదన్ సింగ్ పేట ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో అతిథి ఉపన్యాసం

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో విశ్రాంత ప్రధానాచార్యుడు డాక్టర్ ఎంపీ రామకృష్ణారావు ఎమ్మెస్సీ రసాయన శాస్త్రం విద్యార్థులకు ×రెట్రో సంశ్లేషణ అనే క్లిష్టమైన అంశంపై బుధవారం అతిథి ఉపన్యాసం ఇచ్చారు. ఔషధరంగంలో పరిశోధన, ఉపాధి అవకాశాలు, భవిష్యత్తు ప్రణాళికపై అవగాహన కల్పించారు. రెట్రో సంశ్లేషణ అంశంపై రాబోయే కాలంలో అనేక ఫలితాలు లభిస్తాయని, ముఖ్యంగా మానవాళికి సంభవిస్తున్న అనేక దీర్ఘ కాలిక వ్యాధులపై పరిశోధనలకు సహకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్ కుమార్

కంబాలచెరువు: జిల్లాలో అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. మావో భవన్‌లోని పీడీఎస్‌యూ కార్యాలయంలో బుధవారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు 2025 -26 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించాయన్నారు. పిల్లల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి దోచుకుంటున్నారని విమర్శించారు. ఆ విద్యాసంస్థలపై విచారణ జరిపి చర్యలు తీసుకోకుంటే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. సమావేశంలో భాను ప్రసాద్, దినేష్, రోహిత్, శ్రీను, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ర్యాలీ విజయవంతంపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

సీటీఆర్ఐ: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని అంబేడ్కర్ సేవాకేంద్రం వ్యవస్థాపకుడు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ సేవా కేంద్రం, ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి రోజు జరిగిన ఉత్సవ ర్యాలీ విజయవంతం కావడంపై ఆయనతో పాటు మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు హర్షం వ్యక్తం చేశారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ చదువు ద్వారా ఉన్నత శిఖరాలకు చేరాలన్న అంబేడ్కర్ ఆశయాన్ని చేరుకునేలా చేయడమే ఆస్క్ ప్రధాన లక్ష్యమన్నారు. సమావేశంలో విజ్జిన మధు, బాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి పోరాటం స్ఫూర్తిదాయకం

- మాజీ ఎంపీ భరత్‌రామ్
- ఘనంగా వీరేశలింగం జయంత్యుత్సవం
- నివాళులర్పించిన ప్రముఖులు



కందుకూరి దంపతుల సమాధులకు నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ భరత్ రామ్



వీరేశలింగం విగ్రహానికి పూలమాల వేస్తున్న టౌన్‌హాల్ అధ్యక్షుడు వెంకటరెడ్డి తదితరులు

సీటీఆర్ఐ: అనాటి సమాజంలో నెలకొన్న మూఢ నమ్మకాలపై కందుకూరి వీరేశలింగం చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ అన్నారు. వీరేశలింగం జయంతి సందర్భంగా ఆనందా గార్డెన్స్‌లోని వీరేశలింగం, రాజ్యలక్ష్మి దంపతుల సమాధులకు బుధవారం ఆయన నివాళులర్పించారు. కాగా.. యుగపురుషుడు వీరేశలింగం జయంతిని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు.

- టౌన్ హాల్లోని కందుకూరి విగ్రహానికి జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ (టౌన్ హాల్) అధ్యక్షుడు జగన్నాథం వెంకటరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లైబ్రరీ సభ్యుడు, తూర్పుగోదావరి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కోశాధికారి కె.సత్యనారాయణ, ఎస్‌వీ రమణారావు, లాయర్ అప్పారావు, భద్రరావు నివాళులర్పించారు.
- హితకారిణి సమాజాన్ని స్థాపించి సమాజంలోని అనేక రుగ్మతలను రూపుమాపేందుకు అను నిత్యం శ్రమించిన సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం అని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కొనియాడారు. ఎస్‌కేవీటీ కళాశాల (అనంద గార్డెన్స్)లో ఆ మహనీయుని సమాధిని సందర్శించి పుష్పాంజలి ఘటించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.
- వీరేశలింగం సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. ఆనందా గార్డెన్స్‌లోని కందుకూరి దంపతుల సమాధులపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.
- కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి అధ్యక్షతన వీరేశలింగం జయంతి నిర్వహించారు.
- కోటిపల్లి బస్టాండ్‌లోని కందుకూరి విగ్రహానికి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పూల మాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం కందుకూరి వీరేశలింగం జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శ్యామల సెంటర్ నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు.



కందుకూరి సమాధుల వద్ద ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల సిబ్బంది



కోటిపల్లి బస్టాండ్‌లో ప్రజా సంఘాల ప్రదర్శన

ఆర్ట్స్ కళాశాలలో..

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం జయంతిని ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బీఎల్‌డీవీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం జన్మించిన రాజమహేంద్రవరంలో నివసిస్తున్నందుకు, ఆయన విధులు నిర్వహించిన కళాశాలలో పనిచేస్తున్నందుకు మనమందరం గర్వించాలని పేర్కొన్నారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ పీఏ సత్యనారాయణ మాట్లాడుతూ ఆనాటి సమాజంలోని దురాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన మహోన్నత వ్యక్తి కందుకూరి వీరేశలింగం అని ప్రశంసించారు. సంస్కృత శాఖ విభాగాధిపతి షేక్ జరీనా బేగం మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం వ్యక్తిత్వాన్ని విద్యార్థులు అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. హిందీ విభాగాధిపతి డాక్టర్ బి.సుబ్బలక్ష్మి మాట్లాడుతూ తెలుగు సాహిత్య ప్రపంచానికి నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగమని కొనియాడారు.

సంపూర్ణ జీవితాన్ని ఆవిష్కరించే కళే నాటకం



నాటక రంగ కళాకారులను సత్కరిస్తున్న ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది

సీటీఆర్ఐ: సంపూర్ణ జీవితాన్ని ఆవిష్కరించే కళే నాటకమని ప్రసిద్ధ నాటక కళాకారుడు సీహెచ్ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో బుధవారం తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నాటక రంగం అనాదిగా ప్రజలకు కాలక్షేపానికి కాకుండా సమాజ మార్పునకు వేదికైందన్నారు. గతంలో ఊరూరా తిరుగుతూ నాటకాలను ప్రదర్శింపజేసేవాళ్లమని, ఆనాటి కాలంలో నాటకానికి గల ఆదరణ వేరని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి మాట్లాడుతూ కందుకూరి సంఘ సంస్కరణతో పాటు సాహిత్యానికి చేసిన కృషి ఎనలేనిదని తెలిపారు. కందుకూరి నాటకం అవార్డు గ్రహీత డీఎస్పీ రావు (దంగేటి సూర్య ప్రకాశరావు) మాట్లాడుతూ అర్థ శతాబ్దంపైగా నాటక రంగమే ఊపిరిగా జీవించామన్నారు. నాటక పరిశోధకుడు డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ సమాజంలోని మూఢాచారాలను రూపుమాపేందుకు కందుకూరి నాటకాన్ని అస్త్రంగా ఉపయోగించారన్నారు. మరో కళాకారిణి సురభి సువర్ణ మాట్లాడుతూ మనిషి జీవించి ఉన్నంత వరకూ నాటకం సజీవంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.శరత్ బాబు, డాక్టర్ వై.స్వర్ణశ్రీ, ఎస్.రాజ్‌కుమార్, పల్లి సుధా, జె.సుగుణ పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు నేటి యువతకు తెలియాలి



కడియంలో నాటక కళాకారులను సత్కరిస్తున్న ఎంపీపీ ప్రసాద్ తదితరులు

కడియం: మహనీయుల త్యాగాలు నేటి యువతకు తెలియాలని కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ అన్నారు. సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం జయంతిని బుధవారం సాయంత్రం చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి కళా సేవాసమితి ఆధ్వర్యంలో కడియం పంచాయతీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ ప్రసాద్ కడియంలో ప్రజాప్రతినిధుల సహకారంతో ఒక కళావేదిక, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు దువ్వూరి సుబ్బమ్మ విగ్రహం ఏర్పాటు చేయడం,చ ఒక శతావధానం నిర్వహించడానికి కృషి చేస్తానన్నారు. కళా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు , గౌరవాధ్యక్షులు తోరాటి వసంతరావు నేతృత్వంలో ప్రముఖ నాటక కళాకారులు బొర్రా రామకృష్ణ, శీలం సుబ్బారావు, కొప్పిశెట్టి చిన్న వెంకటరావు (చంటి)లకు ।కందుకూరి నాటక రత్న॥ అవార్డుల ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. కందుకూరి జయంతిని నాటక దినోత్సవంగా జరపటం అభినందనీయమని సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురాం, కడియం మండల నీటి సంఘం చైర్మన్ చిక్కాల ఈశ్వరరావు అన్నారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

రాజమహేంద్రవరం రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని మండల ఫీల్డ్ అసిస్టెంట్లు సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డీ.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లను ఏ స్థాయిలోను ఉద్యోగిగా గుర్తించకపోవడం, 2016 నుంచి ఒక్కరూపాయి కూడా జీతం పెంచలేదని, అధికార పార్టీ నేతలు చులకనగా చూడటంపై తప్పని పరిస్థితిల్లో తదుపరి కార్యాచరణను తెలియజేస్తున్నామన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను గ్రామ పంచాయతీ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని, మండలం యూనిట్‌గా తీసుకుని అంతర్గత బదిలీలు చేపట్టాలని, విధి నిర్వహణలో మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించి, నష్టపరిహారంగా రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని, లేని పక్షంలో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నెల 21న పనులు పూర్తిగా ఆపేసి, పెన్‌డౌన్ కార్యక్రమం చేపడతాడమన్నారు. 28 నుంచి విధులను పూర్తిగా బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగుతామన్నారు.

జీజీయూలో వాతావరణ గడియారం



వాతావరణ గడియారాన్ని ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న శశికిరణ్‌వర్మ

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) ప్రాంగణంలో వాతావరణ గడియారం ఏర్పాటు చేయనున్నామని యూనివర్సిటీ ప్రొ చాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ గడియారాన్ని వాతావరణ శాస్త్రవేత్త, ఐఐటీ (ముంబై) ప్రొఫెసర్, ఎనర్జీ స్వరాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చేతన్‌సింగ్ సోలంకి అందజేశారన్నారు. దీని ద్వారా ప్రపంచ వాతావరణ మార్పులపై విద్యార్థులకు అవగాహన పెంచడంతోపాటు గ్లోబల్ ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల సెల్సియస్ మించి పెరగకూడదనే లక్ష్యానికి మిగిలి ఉన్న సమయాన్ని హైలెట్ చేస్తుందన్నారు. ఈ సందర్భంగా గడియారంతోపాటు స్వర్ణ ధ్రువపత్రాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్‌కు అందజేశారు.

చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ మాకొద్దు

- దాన్ని వేరే చోటుకు తరలించండి
- కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే వినతి



కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి తదితరులు

సీటీఆర్ఐ: బిక్కవోలు మండలం కాపవరం, బలభద్రపురం గ్రామాల సమీపంలో ఏర్పాటు చేయనున్న చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్‌ను వేరే చోటకు తరలించాలని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఈ మేరకు బలభద్రపురం గ్రామస్తుల తరపున సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రాజమహేంద్రవరంలో కలెక్టర్ పి.ప్రశాంతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ ప్లాంట్ ఏర్పాటు వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, చెత్త తరలించే వాహనాలు తిరగడం వల్ల వచ్చే ట్రాఫిక్ సమస్యలతో పాటు పలు అంటువ్యాధులు ప్రబలడానికి ఉన్న అవకాశాలను వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ అన్ని అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో (బలభద్రపురం గ్రామ పార్టీ కన్వీనర్) కొవ్వూరి వెంకటరామారెడ్డి, (ఎస్సీ విభాగం నాయకులు) గుబ్బల లాజర్ బాబు, పార్టీ నాయకులు సబ్బెళ్ల వీర రాఘవరెడ్డి, పడాల వెంకటరెడ్డి (మిఠాయి) ఉన్నారు.

నిబంధనలు విస్మరిస్తే కఠిన చర్యలు

కంబాలచెరువు: ప్రైవేటు పాఠశాలల నిర్వహణ విషయంలో ప్రభుత్వ నిబంధనలను విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. దిలీప్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో పుస్తకాలు, యూనిఫాం, అమ్మడం నిబంధనలకు విరుద్ధమన్నారు. బస్సుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలననారు. ఈ విద్యా సంవత్సరం కార్యాలయానికి సమర్పించాల్సిన రిపోర్టును సకాలంలో అందజేయాలన్నారు. ఫీజుల వివరాలు నోటీసు బోర్డులలో ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీలు జయంతి శాస్త్రి, ప్రసాద్, శ్రీనివాస్, అర్బన్‌లో ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

కడియం: మురమండ గ్రామంలో మాచరమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి బుధవారం ఆయన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ.లక్ష అందజేశారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, కురుకూరి కిషోర్, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్తిపాటి వెంకటరామయ్య, ప్రత్తిపాటి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల ధర్నా

రాజమహేంద్రవరం సిటీ: కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీపై ఫైల్ చేసిన చార్జిషీట్ ఎత్తివేయాలని పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కంబాలచెరువు పార్కు ఆదాయపు పన్నుశాఖ కార్యాలయం నిరసన తెలిపారు.

త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం

రాజమహేంద్రవరం రూరల్: శ్రీరామ నవమిని పురస్కరించుకుని బుధవారం పిడింగొయ్యి బుచ్చయ్య నగర్‌లో రాజమండ్రి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో శేఖర్ బాబు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మార్ని



రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మార్ని వాసుదేవరావు (వాసు)ను నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సిఫారసు మేరకు కూటమి ప్రభుత్వం ఈ నియామకం చేపట్టింది.

కోరుకొండ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: కోరుకొండ రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలు జారీ చేశారు. ఆయన బుధవారం శానిటోరియం వద్ద నుంచి కంబాలచెరువు వరకు చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. మొత్తం మూడు కిలోమీటర్లలో రోడ్డు వెడల్పు కోసం జరిపిన మార్కింగ్‌ను పరిశీలించారు. తక్షణమే పర్మనెంట్ ఎంక్రోచ్‌మెంట్లు తొలగించి, రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. కోలమూరు పంచాయితీ పరిధిలోని ఎయిర్ పోర్ట్ రోడ్డులో డ్రైనేజీపై ఆక్రమణలు తొలగించాలని, మెయిన్ రోడ్డు లెవెల్‌కు చదును చేయాలన్నారు. తాడితోట వద్ద ఉన్న హాస్పిటల్ ఆక్యుపెన్సీ బిల్డింగ్‌ను సమగ్రంగా పరిశీలించారు. ఆయన వెంట అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సిటీ ప్లానర్ జి.కోటయ్య, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ వినూత్న, ఏడీహెచ్ స్వాతి, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీఎంసీ పాఠశాలల హెచ్ఎంలతో సమీక్ష

కంబాలచెరువు: లాలాచెరువు మున్సిపల్ హైస్కూల్లో బుధవారం తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లా (రంపచోడవరం డివిజన్) పీఎంసీ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీఎస్ సుభాషిణి ప్రారంభించారు. జిల్లాలోని 20 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలకు విడుదలైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని, ఈనెల లోపు పనులు పూర్తి చేయాలని సుభాషిణి తెలిపారు. సీమాట్ లెక్చరర్ ప్రసాదరావు, మహేష్ రెడ్డి, జయలక్ష్మి తదితరులు పీఎంసీ 6 పిల్లర్లపై అవగాహన కల్పించారు. స్టేట్ ఫైనాన్స్ కంట్రోలర్ రాజగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాత్ర చాలా గొప్పదన్నారు. లాలాచెరువు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు, నిర్వహణను అభినందించారు.

గోదావరిలో మునిగి మహిళ మృతి

కంబాలచెరువు: స్థానిక మార్కండేయేశ్వరస్వామి గుడి సమీపంలో గోదావరిలో మునిగి మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. విజయనగరానికి చెందిన వాకచర్ల నారాయణమ్మ (65) రాజమహేంద్రవరంలోని ఓంశాంతి ఆశ్రమానికి వచ్చి వెళుతుంటుంది. ఆ విధంగా ఇక్కడకు వచ్చి ప్రమాదవశాత్తూ గోదావరిలో పడి మృతి చెందిఉంటుందని భావిస్తున్నారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఒకటో పట్టణ పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆమె వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.

మహిళ అదృశ్యం

భర్తపై గొడవపడిన భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటనపై త్రీటౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. తుమ్మలావకు చెందిన మహిళ ఈ నెల 13న ఇంటిలో తన భర్తతో గొడవపడింది. అదే రోజు ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ మేరకు భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

30 లీటర్ల సారా స్వాధీనం

రంగంపేట: మర్రిపూడి గ్రామంలో బుధవారం దాడి నిర్వహించి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. గ్రామానికి చెందిన జీలం దుర్గయ్యపై కేసు నమోదు చేశామన్నారు.

సినిమాలు



శ్యామల	: గుడ్ బ్యాడ్ అగ్లీ
సూర్యమినీ	: జాట్
సూర్యప్యాలెస్	: జాక్
స్వామి	: ఓదెల-2
శివజ్యోతి	: గుడ్‌బ్యాడ్అగ్లీ
అనుశ్రీ	: జాక్
రాజా	: ఓదెల-2
ఊర్వశి	: రాబిన్‌హుడ్
మేనక	: చెరసాల,నాన్నా మళ్లీరావా
రంభ	: సంక్రాంతికి వస్తున్నాం
కుమారి	: ఓదెల-2
అప్సర	: మ్యాడ్‌స్క్వేర్
అశోక	: జాక్
నామవరం వీఎస్‌మహల్	: ఓదెల-2
ధవళేశ్వరం మురళీకృష్ణ	: ఓదెల-2
కడియం వెంకటసూర్య	: జాక్